# లేక్ వ్యూ




విజయలక్ష్మి

సునాయాసంగా సంపాదించాలనుకున్న ఒక మేధావి ఒక పట్టణంలో ఒక పెద్ద యింట్లో మూడేసి గదుల వాటాలు— క్రింద రెండూ పైన రెండూగా కట్టి నలుగురు గృహస్థులకు అద్దెకిచ్చాడు. ఆ మేడ పేరు "లేక్ వ్యూ" (Lake View). ఆ యింటి కెదురుగా ఓ పెద్ద చెరువు; చెరువు కవతల దూరంగా కొండ; చెరువులో అక్కడక్కడా కలువపూలు - మేడక్కూడా శోభను కూర్చాయి. క్రింద రెండింట్లో ఒక ఫ్లాట్‌లో ఒక డాక్టరు, ఇంకోదాంట్లో ఒక ఇంజనీరు పైన ఒక ప్రక్క ఒక పబ్లిషర్, ఇంకో ప్రక్క ఎగ్రికల్చరల్ డిపార్టుమెంటులో పని చేసే ఒక గజిటెడ్ ఆఫీసరు వుంటున్నారు.

డాక్టరు కృష్ణమూర్తి ప్రొద్దున్నే హాస్పిటల్‌కు వెళ్ళిపోయాడు. అతని భార్య సరోజిని పేపరు చూస్తోంది. పనిమనిషి గిన్నెలు వెయ్యమని కేకేసింది. ఆ నాలుగిళ్ళవాళ్ళకు ఒకే పనిమనిషి. "పైకి వెళ్ళిరావే; నేను వూరికేనే కూర్చున్నంతసేపూ రావు; సరిగ్గా పేపరు చేతిలోకి తీసుకోగానే పిలుస్తావ్" అంది సరోజిని.

విసుక్కుంటూ పేపరు బల్లమీద పడేసి తలకు నూనె రాసుకుని స్నానం చేసి వచ్చింది. నాలుగు వాటాలు ఊడ్చివచ్చిన పనిమనిషి, సరోజిని బైట పడేసిన క్రిందటి రాత్రి వంట గిన్నెలు, వెండి కంచాలు, తెల్లారి కాఫీ సామానులు కడగడం మొదలెట్టింది. సరోజిని కూనిరాగం తీసుకుంటూ సుతారంగా చెంపలకు పౌడరు రుద్దుకుంటూ అద్దం ముందు కూర్చుంది. ఆడవాళ్ళకు నొక్కులజుట్టు ఎంతో అందం.

అందులో పొడుగాటి జుట్టు యింకా అందం. సరోజిని నిజంగా అందమైనది. ఆ సంగతి ఆమెక్కూడ బాగా తెలుసు.

అందుకనే ఆమె చూపులో, నవ్వులో కాస్తంత నిర్లక్ష్యం తొణుకుతూనే వుంటుంది. కళ్ళకు కాటుక దిద్దుకుంటుండగా బజర్ మ్రోగింది. "ఆగుతాడులే కాసేపు" అనుకుని తిలకం దిద్దడం మొదలెట్టింది. తెల్లని ఫాలభాగాన్ని విభజిస్తూ పైకి ఎగప్రాకిన అరుణ రేఖ ఆమె గుండ్రటి ముఖానికి కాస్తంత కళదనాన్నిచ్చింది. యీలోపల బజర్ ఇంకోసారి మ్రోగింది. మళ్ళీ మ్రోగుతూనే వుంది. "ఆహా, ప్రయోజకుడేనే ఎవరో" అనుకుంది. నెమ్మదిగ లేచి వెళ్ళి తలుపు తీసింది. పచారుకొట్టు వాళ్ళమనిషి. "లిస్టు వ్రాస్తారా. యిస్తే పట్టుకుపోతాను" అన్నాడు. ప్రతినెలా 24 వ తారీఖున ఆ వీధికి వస్తాడు ఆ మనిషి. వచ్చేనెలకు కావలసిన సామాన్ల జాబితాలు ఇంటింటినుంచీ పట్టుకువెళ్తాడు. సరిగ్గా వ తేదీన అన్ని సామాన్లూ జాబితా ప్రకారం గంపల్లో సర్ది ఎవరి గంప వాళ్ళింట్లో అప్పగిస్తాడు. మళ్ళీ 7 వ తేదీన వచ్చి డబ్బు పట్టుకెళ్తాడు. "ఇవాళ 24 ఏమిటి, గుర్తేలేదు. పైకి వెళ్ళిరండి యీలోపల వ్రాసిస్తాను" అంది. కాయితం, కలం తీసుకుని దబదబా జాబితా వ్రాసి ఆ మనిషి కిచ్చి పంపేసింది. పనిమనిషి పాత్రలు కడిగి లోపల పెట్టి పై యిళ్ళకు వెళ్ళింది.

సరోజిని రాకింగ్ ఛైర్‌లోపల కూర్చుని పేపరు చూస్తోంది. ముగించేంతలో మళ్ళీ పనిమనిషి కేక. వెళ్ళి తలుపు తీసింది. పనిమనిషి బాత్‌రూమ్ కడిగి విడిచిన బట్టలు వుతకడానికి తీసికెళ్లింది. మాలక్ష్మి ఆ మేడకు ప్రొద్దున్నే ఆరింటికి వస్తుంది. వరసగా నాలుగుభాగాలూ ఊడవడం. తర్వాత గిన్నెలు తోమడం, ఆ తర్వాత బట్టలుతకడం చేసి పన్నెండు లోపలే యింటి కెళ్లిపోతుంది. సాయింత్రం మళ్ళీ మూడుగంటలకు వచ్చి వరసగా అందరిళ్ళలో బట్టలు మడవడం, ఇళ్ళు వూడవడం, పాత్రలు కడగడం చేసి, ఆరింటిలోపల వెళ్ళిపోతుంది. ఒక్కో యింట్లో పదేసిరూపాయలు తీసుకుంటుంది. పేపరు పూర్తిగా చదివేసి పది గంటలకు వంట ప్రారంభించింది సరోజిని. హాట్ ప్లేటుమీదా, ప్రెషర్ కుక్కర్‌లోనూ కనుక వంటంతా గంటలో అయిపోయింది. అన్నిటిమీదా మూతలుపెట్టి వంటిల్లు తలుపేసి పడగ్గదిలోకి వచ్చింది. వారపత్రికలు ఆ క్రిందటిరోజే చదివేసింది. చదవడానికేమీ కనపడలేదు. అటుయిటు చూసింది. కుట్టుమిషన్ కవరు తీసి తుడిచి నూనెపోసి మళ్ళీ మూసేసింది. కుట్టడానికి బట్టలూ లేవు.

ఎండతోపాటు విసుగు హెచ్చుతోంది ఆమెకు. సరోజినికి తల్లి గుర్తుకు వచ్చింది. తండ్రి ఆమెకు సరిగా గుర్తేలేదు. చదువుకోసం సరోజిని హాస్టల్లో వుంటూ పట్టణాల్లోనే గడిపింది. ఎప్పుడో నెల్లాళ్ళ సెలవలు తల్లితో గడిపితే 'ఛేంజ్'గా వుండే దామెకు. విసుగుపుట్టకముందే మళ్ళీ స్కూలో, కాలేజో తెరిచేవారు.

తల్లి లంకంత యింట్లో ఒంటరిగా వుండేది. భర్త పోయాకకూడా పొలం కౌలుకు యివ్వకుండా నమ్మకమైన మనిషిని పెట్టుకుని వ్యవసాయం తనే చూసుకునేది. ఇంట్లో పాడి. దొడ్లో పాదులూ ఆమెకో క్షణం తీరేదికాదు. ప్రతి పండుగా, ప్రతి పర్వదినం యథావిధిగా జరిపేది. సరోజినికి వినాయకచవితి ఏ నెల్లో వస్తుందో తెలీదు. అత్తవారిల్లు గుర్తుకు వచ్చిందామెకు. "ఆయనకు ఆ వూళ్ళోనే కాగూడదూ వుద్యోగం" అనుకుంది. అత్తవారిల్లంటే సరోజినికి మహా యిష్టం. ఎప్పుడూ పూజలు, ఉపవాసాలు, పంచాంగం, వారం, వర్జ్యం, వత్తులు చేసుకోడంతో తీరికలేని అత్తగారు, ఇల్లు పట్టించుకోని దివ్యజ్ఞాన సమాజపు మెంబరైన మామగారు, కాలేజీ కబుర్లు డాబులు చెప్పే మరుదులు, హోమ్ వర్కు కు సాయం చెయ్యమంటూ వచ్చే బావగార్ల పిల్లలు, ఒకరితర్వాత ఒకరుగా పురుడు పోసుకోడానికి వచ్చే ఆడపడుచులు, వాళ్ళ పిల్లలు–ఇవన్నీ చూశాక, ఇల్లూ, కుటుంబం అంటే తెలియని సరోజినికి అత్తవారిల్లు భూతలస్వర్గంలాగ తోచింది. ఓ ఏడాది వాళ్ళతో గడపాక భర్తకు బదిలీ అయితే యీ వూరొచ్చిం తర్వాత ఒంటరితనం భూతమై సవారీ చేస్తూంది దామెమీద.

యింట్లో నడయాడే పసిపిల్లలు లేరు. భోజనానికి. నిద్రకుమాత్రం యింటికి వచ్చే భర్తతో విసుగెత్తిపోయింది సరోజినికి. నిస్సహాయంగా ఎప్పుడూ గడియారంవంక చూడ్డం అలవాటయిందామెకు. ఎట్లా కునుకుపట్టేసిందో, తర్వాత బజర్ చప్పుడుతో మెలుకువ వచ్చిందామెకు. టైమ్‌చూసింది– 2-30 అయింది. వెళ్ళి తలుపు తీసింది. కృష్ణమూర్తి లోపలకు వస్తూనే "త్వరగా వడ్డించు సరోజా" అన్నాడు. సరోజిని అన్నీ బల్లమీద పెట్టింది. "సారీ, సరో, సినిమాకు రేపు వెళ్దాం, యివాళ ప్రోగ్రాము కాన్సిలయినట్టే; మద్రాసునుంచి డాక్టరు నటేశన్ వచ్చారు. యీ సాయింత్రం మెడికల్ ఎసోసియేషన్ బిల్డింగులో హైపర్ టెన్షన్ మీద మాట్లాడుతారట" అన్నాడు కృష్ణమూర్తి.

సరోజినికి ఒళ్ళు మండిపోయింది. "ఇవాళ మెడికల్ ఎసోసియేషన్, రేపు లయన్సు క్లబ్, ఎల్లుండి రోటరీ - యింకేమన్నా వున్నాయా మీ ప్రోగ్రాములు?" అంది.

"ఏమిటి అర్థంలేకుండా మాట్లాడుతావు, ఎందుకు - మీ ఆడవాళ్ళు చదువుకున్నా దండగే" అన్నాడు కృష్ణ.

"ఔను, మగవాళ్ళకెంత యిల్లు పట్టకపోయినా మెదలకుండా వూరుకొంటే చదువు లాభం, మాట్లాడితే దండగ."


"ఆకలిగా వున్నావేమో! ముందు భోంచెయ్యి; నాకోసం ఆగవద్దని ఎన్ని సార్లు చెప్పాను."

"నేను ఆగుతానని మీకు తెలిసేనా రెండింటికీ, మూడింటికీ రావడం. ఆగక పోతే ఏకంగా రాత్రికే వస్తారు," అంది సరోజిని కృష్ణమూర్తి మరి మాట్లాడ లేదు. భోంచేసి పక్కమీద ఒరిగి పేపరు చదివి, ఆ తర్వాత కాసేపు నిద్ర పోయాడు. లేచాక టీ త్రాగి, డ్రెస్ చేసుకుని మీటింగుకు వెళ్ళిపోయాడు.

సరోజినికి బాగా ఏడుపొచ్చింది. కిటికీ లోంచి బైటకు చూసింది. చెరువు కవతల పక్క చాకలివాళ్ళు బట్టలారేస్తున్నారు. "పడి చావడానికక్కడ లేకుండా వీళ్లొక కావలా—వెధవలు!" అనుకుంది. సాయంత్రము అయిదయ్యాక సరోజిని డ్రెస్ వేసుకోడం మొదలెట్టింది. భర్తమీద కోపంతో మరింత శ్రద్ధగా, అందంగా అలంకరించుకుంది. పర్సులో డబ్బు వేసుకుని, "ఎక్కడికి వెళ్ళడం" అనుకుంది. ఇదివరలో నెలకోసారో రెండుసార్లో భర్తతో కలసి బజారు కెళ్ళి అన్ని సామాన్లూ తెచ్చుకునేది. ఓనాడు కృష్ణమూర్తి మహా సంతోషంతో ఇహానుంచి ప్రొవిషన్స్ యింటికే పంపిస్తారట. ఆ కొట్టువాళ్ళ మనిషే వచ్చి లిస్టు తీసికెళ్తాట్ట ప్రతినెలా" అన్నాడు. సరోజిని ఫసూరుమంది. లవెండర్ పరిమళం తోడురాగా యిలు తాళంపెట్టి రిక్షా ఎక్కి బట్టల షాపుకు పోనీమంది. ఓ అరడజను జాకిటు బట్టలు కొన్నది. "ఓ నాలుగు రోజులు మిషన్ త్రిప్పుకోవచ్చు" ననుకుంది. యింటికి వెళ్ల బుద్ధికాలేదు. అటే లేడీస్ క్లబ్ కెళ్ళింది.

ఆ క్లబ్బు అంటే సరోజినికి చిరాకు. అక్కడ చేరినవారంతా కాస్త వయసు మళ్ళినవాళ్లే. వాళ్ళ మాటలు, ఈర్ష్యలు, బడాయిలు ఆమెకు అసహ్యం! కాని సాయంత్రాలు ఒంటరిగా యింట్లో గడపలేక ఆ క్లబ్ కే వెళ్తూంటుంది తరచుగ. లేని సరదా తెచ్చిపెట్టుకుని కబుర్లాడుతూ, చెస్ ఆడుతూ 8 గంటలకి యిల్లు చేరింది. కృష్ణమూర్తి యింట్లో కనపడగానే ఆశ్చర్యమయింది. భర్త యింటికి వచ్చేప్పటికి తను లేననే భావం ఆమెకు కాస్త తృప్తినిచ్చింది. "పగలంతా పని 'లైట్'గా వుంటుంది, సాయంత్రం వచ్చేప్పటికి నువ్వు యింట్లో లేకపోతే ఎట్లా సరోజా?" అన్నాడు కృష్ణమూర్తి. "రోజంతా మీరు లేకపోతే నాకూ అట్లాగే వుంటుంది" అంది సరోజిని.

కృష్ణమూర్తికి నిజంగానే కోపం వచ్చింది. మాటామంతీ లేకుండా భోజనాలు చేశారు. సరోజిని ఏదైనా భరించగలదు కాని భర్త బాధ పడితేమాత్రం సహించలేదు. భర్త రానంతసేపూ, అతడు వస్తే ఎంత బాగుంటుందో. సరదాగా ఏమేమి మాట్లాడుకోవచ్చో అందంగా వూహించుకుంటుంది. ఒక్కోసారి రిహార్సల్ కూడ చేసుకుంటుంది. కాని ఆమె వాక్యానంలో ఏ రావలు వున్నాడో కాని మాటమాత్రం ఎప్పుడూ కటువుగానే వస్తుంది. దాంతో రసాభాస! సరోజనికి కళ్ళనీళ్లు వచ్చాయి. కష్టంగా ఆపుకుంటూ గోడవైపు తిరిగింది. కృష్ణమూర్తి చూచాడు. "చూడు సరూ, ఎందు కేడుస్తావు. నేను యింట్లో నీతో ఎక్కువసేపు గడపడంలేదని నువ్వేడుస్తూ కూర్చుంటే నే నేం చెయ్యగలను చెప్పు? నావృత్తి అట్లాంటిది. దాన్ని నువ్వు నా నిర్లక్ష్యం గానో, అయిష్టంగానో భావిస్తే నే నేం గాను? కష్టపడి యింటికి వచ్చేవాడికి నువ్వు యిచ్చే ట్రీట్ మెంట్ యిదా? నువ్వంటే నాకెంత ప్రాణమో నీకు తెలీదు. నువ్వు నన్ను అర్థం చేసుకోలేవు" అన్నాడు నిజమైన బాధతో. సరోజిని పశ్చాత్తాపానికి అంతులేదు. "పాపిష్టి దాన్ని" అనుకుంది. "నాకు తెలుసు, మీరు నాకు బాగా తెలుసు; కాని నాకు విసుగుపుడుతోంది; దాంతో కోపం వస్తోంది. నేను—నేను వద్దనుకున్నా కోపం వస్తోంది. నే నేం చెయ్యను? చూడండి నాకు నిజంగా బాధలేదు. ఊరికే అప్పుడప్పుడు నాకు కోపం వస్తే మీరు బాధ పడకూడదు" అంటూ నవ్వింది తడి కళ్ళతో. భార్య తెచ్చిపెట్టుకున్న నవ్వు చూసి కృష్ణమూర్తి జాలిగా నవ్వాడు.



రెండో భాగంలో వుంటున్న సులోచన భర్తను 8 గంటలకు, పిల్లలను 9 గంటలకు పంపాలి కనుక తెల్లవారి 5కే లేచి, బాయిలర్‌లో నిప్పు వేసి. స్టవ్ మీద నీళ్లు కాచి ఫిల్టర్‌లో పోసింది. ముఖం కడుక్కుని తలుపు తీసి. అప్పటికే పాల వాడు పెట్టి వెళ్లిన సీలు చేసిన పాలసీసాలు యింట్లోకి తెచ్చి కాఫీ చేసి భర్తను నిద్ర లేపింది. చంద్రశేఖర్ కాఫీ త్రాగేసి చదువుకోడం మొదలెట్టాడు. టిఫిన్ చెయ్యడం అయ్యాక కూతుర్ని, కొడుకుని నిద్ర లేపింది. వాళ్ళకు స్నానాలు చేయించి, కూతురికి జడవేసి రిబ్బన్ కట్టేప్పటికి భర్త స్నానం అయింది. ముగ్గురికీ టిఫిను పెట్టేసి పాలగ్లాసులు అందించే వేళకు పసివాడు లేచాడు. వాణ్ణి చేతిలోకి తీసుకోగానే, భర్త స్కూటర్ మీద కాలేజికి వెళ్లిపొయ్యాడు. ఆయన స్టడీ లీవు తీసుకుని పిహెచ్. డి. కి చదువుతున్నాడు. స్కూలుకు వెళ్ళే పిల్లలిద్దరూ సర్దిన పుస్తకాలే మళ్లీ సర్దుకుంటూ, సరిగ్గా రాని పద్యాల్ని మళ్లీ కంఠతా పెట్టుకుంటూ ఇంట్లోంచి బైటకు బైట నుంచి యింట్లోకి తిరుగుతున్నారు. స్కూలు బస్ రాగానే పిల్లలిద్దరినీ ఎక్కించి తలుపేసుకుంది. పది గంటలకల్లా పసిబిడ్డ స్నానం, తన స్నానం ముగించి, విడిచిన బట్టలన్నీ సబ్బులో నానబెట్టింది. పని మనిషి బట్టలుతుకుతూ "మనింట్లో బట్టలెక్కువండీ అమ్మగారు, నాకు రెండు రూపాయలెక్కువిప్పించాలి" అంది.

"వచ్చే నెల్లో చూద్దాం లేవే" అంది సులోచన. వంటింటి గడపదగ్గర చాప లేసి బిడ్డను పడుకోబెట్టి వంట మొదలెట్టింది. మధ్య మధ్య లేవడం, బిడ్డను సరిగ్గా పడుకోబెట్టడం, దూరమైన గిలకలు, బొమ్మలు దగ్గరపెయ్యడం చేస్తూ వుంది. వంటయ్యాక రెండు కారియర్లలోనూ సర్దేసింది. పన్నెండుకల్లా మనిషి వచ్చి కారియర్లు తీసికెళ్ళాడు. ఆ మనిషి స్కూళ్ళకు, ఆఫీసులకు కారియర్లు చేరవేసి నెలకు పదరూపాయలు సంపాదిస్తాడు. సులోచనకూడ భోంచేసింది. పసిబిడ్డ పాలుత్రాగి నిదపోగానే ఆమెకు తీరిక దొరికింది. పగలు నిద్రపోయే అలవాటు లేదామెకు. ఓ పాతబట్ట తీసుకుని బల్లలు, కుర్చీలు, రేడియో, టేబిల్ లైటు తుడిచింది. ఫ్లవర్ వాస్‌లో వాడిపోయిన ఆకులూ పూలూ తీసేసి నీళ్ళు మార్చింది. వాడిన స్వెటరు విప్పి మళ్ళీ క్రొత్త డిజైన్‌లో అల్లడం మొదలెట్టింది. ఒక్కో రోజు టేబిల్ క్లాత్‌మీదనో, దిండు కవరు మీదనో ఎంబ్రాయిడరీ చేస్తుంది. ఇంకో రోజు ప్లాస్టిక్ తీగతో బుట్టలో, బొమ్మలో చేస్తుంది. ఉతికి ఆరవేసిన బట్టలు తీసుకువచ్చి ఇస్త్రీ చేసి, ఎవరి డ్రెస్‌లో వాళ్ళ మేజోళ్ళు, కర్చీఫు, టై పెట్టేసింది.

అప్పుడే బైట తోపుడుబండిలో ఇస్త్రీ పెట్టె, బొగ్గులబుట్ట, నీళ్ళచెంబు తీసుకుని వెళ్ళే చాకలి 'ఇస్త్రీ – ఇస్త్రీ' అని అరుస్తున్నాడు. వాడికిచ్చి చేయించుకోవచ్చుగాని, నా కేం పని యింట్లో. పైన నీలవేణికి పిల్లలుకూడ లేరు; అయినా చీరలన్నీ వాడికిచ్చే ఇస్త్రీ చేయించుకుంటుంది. ఎప్పుడూ ఇంట్లో చేసుకోదు. ఏం పని వుంటుందో, ఏమి తోస్తుందో" అనుకుంది. నీలవేణికి పిల్లలంటే మహా ఆపేక్ష. అప్పుడప్పుడు పిల్లలను తీసికెడుతుంది. తను వెళ్ళి పిల్చుకువస్తేకాని వాళ్ళను పంపదు. ఇష్టంకొద్దీ వాళ్ళకు మైసూరుపాకులు, జంతికలు యిస్తుంటుంది. పిల్లలు ఒకటిరెండు తింటారు. మర్నాడు కడుపునొప్పి అంటారు. తినవద్దంటే పిల్లలు వినరు. పెట్టవద్దంటే నీలవేణి ఏమనుకుంటుందో ఏమోనని భయం. అందుకే ఎక్కువ పిల్లలను పైకి వెళ్ళనివ్వదు సులోచన. కాస్త ఎండ తగ్గగానే తోటకు నీళ్లు పెట్టింది. పసిపిల్లల నవ్వులన్నా వికసించే పూలన్నా సులోచనకు ప్రాణం. పిల్లలు వచ్చేవేళకు ఏదో ఫలహారం చేసింది.

బస్ వచ్చింది. పిల్లలు వస్తూనే "అమ్మా సర్కస్ యివాళ ఆఖరిరోజట-నాన్నగారు వస్తారామరి" అనడిగారు. "ప్రొద్దున చెప్పాను, మీ నాన్నగారు వస్తారు, మీరు టిఫిన్ తినేసి బట్టలు మార్చుకుని సిద్ధంగా వుండండి" అంది. వాళ్ళకు నచ్చిన బట్టలు వేసుకుని తండ్రికోసం ఎదురు చూడసాగారు పిల్లలు. ఎంతకీ రాలేదు చంద్రశేఖరం. పిల్లలు ఒకే అల్లరి. "సర్కస్ ఇవాళతో ఆఖరమ్మా; నాన్నగారితో నువు నిజంగా చెప్పావా; నాన్నగారు మర్చిపోయారేమో"నంటూ వేధించడం మొదలెట్టారు. ఇంకాసేపటికి ఎనిమిదేళ్ళ కొడుకు ఏడవడం మొదలెట్టేసరికి చిరాకేసింది సులోచనకు. దానితో ఒక్కటి తగలనిచ్చింది వాడికి. దెబ్బతిన్న అవమానానికి వెక్కివెక్కి ఏడ్చాడు. మనసు కరిగింది సులోచనకు. కొడుకును దగ్గరకు తీసుకోబోయింది; వాడు రాలేదు. కోపంతో సరిగ్గా భోంచెయ్యకుండా నిద్రపోయిన పిల్లలను చూసి వుసూరుమంది. చిన్నబిడ్డను పెట్టుకుని తనెట్లా తీసికెళ్ళగలదు, ఏడు మైళ్ళ అవతల సర్కస్‌కు? రెండు బస్సులు మారాలి. భర్తయితే స్కూటర్ మీద యిద్దరి పిల్లలనీ తీసికెళ్ళగలడు. నెల్లాళ్ళనుంచి కనీసం పదిసార్లయినా చెప్పింది భర్తతో-పిల్లలు సర్కస్ చూడాలంటున్నారని. తీరుబడి కాలేదు ఆయనకు! భార్యా పిల్లలకన్న ఎక్కువైపోయింది డాక్టరేటు చదువు! తొమ్మిదింటికి తిరిగి వచ్చిన చంద్రశేఖర్ "ప్రొఫెసర్ సాయంత్రం రమ్మని కబురెట్టారు. డిస్కస్ చేస్తూ కూర్చుంటే యీవేళయింది. నాకోసం ఆయనకూడా యింతసేపూ కాలేజిలోనే వున్నారు" అన్నాడు.

సులోచన ఏమీ మాట్లాడలేదు.

"ఏమిటి మాటా మంచీలేకుండా యీ వడ్డన" అన్నాడు చంద్రశేఖరం. "ఏం. కూర బాగోలేదా?" అంది భార్య. "కూర

"బాగానే వుంది; నీ ముఖం బాగాలేదు" అన్నాడు భర్త. "అందుకు నేనేం చెయ్యను?" "కాస్త నవ్వవోయ్" అన్నాడు శేఖరం. "బాబును అనవసరంగా కొట్టాను. వాడు ఏడ్చి సరిగ్గా అన్నం తినకుండా పడుకున్నాడు. నేనెట్లా నవ్వను? స్విచ్ వేస్తే లైటు వెలిగినట్టు, ఫాన్ తిరిగినట్టు, భర్త సముఖంలో భార్య సర్వావస్థలయందు నవ్వుతూ వుండాలంటే యంత్రంలాగా జీవించాలి; అది నావల్ల కాదు;" అంది సులోచన. "సులో! పిల్లలంటే తెలియదు. నువ్వుకూడ నన్నర్థంచేసుకోకపోతే ఎట్లా? పి హెచ్.డి. ఎందుకింత కష్టపడి చదవాలి నేను? డిగ్రీ వస్తేగాని ప్రమోషన్ రాదనేగా? జీతం ఎక్కువైతే మరి నాలుగు సినిమాలు చూద్దామనే ఆశ నాకు? మీ సుఖంకోసం కాకపోతే నేనెందుకు కష్టపడతాను" అన్నాడు. "ఔను, 'మీ నాన్నగారు చదువుతున్నారు. రెండేళ్ళు పోయాక వారి జీతం పెరుగుతుంది. అప్పుడు వెల్దురుగాని సర్కస్‌కు' అని చెప్తే పిల్లలకు అర్థం అవుతుందని నాకు తెలీదు" అంది సులోచన. శేఖరం మాట్లాడలేదు. కాసేపాగి సులోచన "ఇప్పుడంటే పి హెచ్.డి వంక; ఎప్పుడు మాత్రం యిల్లన్నా, పిల్లలన్నా పట్టిందా మీకు? యింట్లో విసిగెత్తి తీరికలో ఏం చెయ్యాలో తోచక ఎంత అల్లాడేదాన్ని? ఒక్కోసారి చచ్చిపోవాలనిపించేది! అర్థం పర్థంలేని పనులు పుట్టించుకుని ఎప్పుడూ తీరిక లేకుండా చేస్తున్నానంటే ఎందుకని?" అంది. "సరే సులోచనా, ఇంకేం చెప్పను నేను. అన్నిటికన్నా నువ్వూ, పిల్లలే నాకు ఎక్కువ అని నువ్వు ఎప్పటికీ నమ్మలేవు. అందమైన నీ కళ్లు వర్షిస్తుంటే చూడాల్సిరావడం నా దురదృష్టం. సరే యిక యీ రాత్రికి నాకు నిద్రకూడ పట్టదు.'' అంటూ టేబిల్ లైటు వేసుకుని పుస్తకం చేతిలోకి తీసుకున్నాడు. సులోచన దుప్పటి పూర్తిగా ముసుగు పెట్టుకుంది.

* * *

పైన ఒక భాగంలో వుంటున్న నీలవేణి వీణాగానంతో లేక్‌వ్యూ నిండిపోయింది. "జగమేలే పరమాత్మా ఎవరితో మొరలిడుదూ" వేడుకుంటోంది, ఆమె, వీణతో గొంతు కలిపి. "ఎన్నిసార్లు చెప్పినా వీధ తలుపు వేసుకోడం మర్చిపోతావు నీవు" అన్నాడు అప్పుడే వచ్చిన ఆమె భర్త నాగరాజు. అతనితోపాటు రచయిత నందగోపాల్ కూడ వచ్చాడు. భర్తమాట విని తలెత్తిన నీలవేణి నందగోపాల్‌ను చూచి వులిక్కిపడింది. "ఈ యిల్లుదాటి ఆ చెరువుకూడ పరవశిస్తోంది మీ పాటకు. మీ గానమాధుర్యాన్ననుభవించే తీరుబడి, అదృష్టం మా స్నేహితుడికి లేవు! మీ సంగీతం మీకు తపస్సు లాంటిదండీ; అందుకే ఏకాంతంగా ఆనందించగలుగుతున్నారు మీరు," అన్నాడు నందగోపాల్ నీలవేణిని చూస్తూ. నీలవేణి "నీకు పుణ్యముంటుంది బాబూ మాట్లాడకు" అనుకుంది. వీణ క్రిందపెట్టి దానిపైన పల్చని సిల్కుదుప్పటి కప్పింది. ఆ దుప్పటిని నాగరాజు, భార్యకు ఎప్పుడో బెంగుళూరు నుంచి తెచ్చిచ్చాడు. అదంటే ఆమెకు ప్రాణం. లోపలకు వెళ్ళి భార్యతో "నందూ ఇక్కడే భోంచేస్తాడు. ముగ్గురికీ వడ్డించు" అన్నాడు. భోజనాల దగ్గర నందగోపాల్ ఏదో మాట్లాడుతూనే వున్నాడు. నాగరాజు మధ్యమధ్య నవ్వుతున్నాడు. నీలవేణి తలవంచుకు భోజనం ముగించింది. తాంబూలాలు వేసుకున్నారు. నందగోపాల్ వెళ్ళిపోయాడు. "అమ్మయ్య" అనుకుంది నీలవేణి. నాగరాజు ప్రక్కన కూర్చున్న భార్యతో "నువ్వు సరిగ్గా భోంచెయ్యలేదేం నీలూ? ఒంట్లో బాగాలేదా?'' అన్నాడు. "ఏమీలేదు భోంచేశానే!'' అంది నీల. "రోజు రోజుకీ అందంగా కనపడుతున్నావ్ నీలూ" అన్నాడు భర్త. హాయనిపించింది భార్యకు. "చూడు; వంటింట్లో పిల్లో ఏమిటో చప్పుడు. కిటికీ తలుపులు మూసిరా'' అన్నాడు నాగరాజు. కొండమీదినుంచి కింద పడ్డట్టయింది నీలవేణికి. మీరు పడుకోండి నే వెళ్తా'' నని అక్కడినుంచి లేచివచ్చి రెండోగదిలో కిటికీ దగ్గరకు కుర్చీ లాక్కొని కూర్చుని బైటకు చూడసాగింది. గతమంతా గుర్తుకు వచ్చింది నీలవేణికి.

రెండుసార్లు మెట్రిక్ తప్పి చదువు మానేసింది. ఎప్పుడూ నవలలు నాటకాలు చదువుకుంటూ సంగీతం నేర్చుకుంటూ గడిపేది. ఆ రోజుల్లో నాగరాజు వ్రాసే నవలలంటే ఆమెకు మహాయిష్టం. ఏడాదికి రెండు మూడు నవలలు వ్రాసేవాడు నాగరాజు. మూడో నాలుగో నవలలు చదివాక ఓ రోజు ధైర్యం చేసి ఆ రచయితకు ఉత్తరం వ్రాసింది. ఆ ఉత్తరంలోని పసితనపు అమాయకత్వమో లేక యౌవనపు ఆవేశాన్నీ, ఉత్సాహాన్నీ కూడ చూసో చకితుడయ్యాడు నాగరాజు. కాని అతడామెకు బదులు వ్రాయలేదు. నీలవేణి ఒకరోజు 'వాణి' తిరగేస్తూ తన వీణ ప్రోగ్రాం మున్న రోజునే, నాగరాజు వ్రాసిన నాటకం - అతడుకూడ పాత్ర తీసుకున్న నాటకం ప్రోగ్రాములో చూసి మహదానందంతో ఆ సంగతి నాగరాజుకు వ్రాస్తూ "మిమ్మల్ని చూడాలని వుంది'' అనికూడ వ్రాసింది. నాగరాజు ఆమె మంచి వైణికురాలని తెలిసి ఆశ్చర్య పోయాడు. ఆమె సంగీతానికే కాక సౌందర్యానికూడా అతడు కదిలిపోయినాడు. ఆ తర్వాత ఇరుప్రక్కలా సాగిన పత్రాల మైత్రి ప్రణయంగా మారి పరిణయంగా రూపొందింది. నీలవేణి ఒక విధంగా తల్లిదండ్రుల నెదిరించి వివాహం మాడింది. కాని అందుకామె ఎన్నడూ చింతించలేదు. పెండ్లయ్యాక ఓ ఏడాది సంతోషంగా గడిచి


పోయిందామెకు. ఆ తర్వాత ఆమెకు భర్తలో ఎంతో మార్పు కనపడుతూ వచ్చింది. రచయిత కాస్తా పబ్లిషర్ అయ్యాక అతనిలో వ్యవహారదక్షత పెరిగింది. అది ఆమెకు గిట్టలేదు. ఆమె దృష్టిలో అతడు మామూలు మనిషయ్యాడు. భార్యతో అతిసాదాగా మాట్లాడ్డము ఆ పిల్లకు గిట్టలేదు. దానికి తోడు పిల్లలు లేరు. ఆ క్రిందవాళ్ళ పిల్లల నెప్పుడన్నా పిల్చుకుంటే, ఆ యిల్లాలు కొంప మునిగిపోయినట్లు కానేపటికి పిల్చుకు వెళ్తుంది. నాలుగు భాగాలకు ఒకే కొళాయి, ఒకే స్నానాలగది వున్నా బాగుండు,అందరు రోజూ కలుసుకోవచ్చు! మగవాళ్ళు యింట్లో లేని సమయాల్లో కూడ ఒకరింటికి ఒకరు రాని నాగరీకులు వాళ్ళంతా! ఏమీ తోచదు తనకు. తోచనపుడల్లా వీణ వాయించుకోడం, కథలూ, కావ్యాలూ చదవడం - భర్త యింట్లో వున్నపుడు వీణకూడ వాయించదు. అతడు అడక్కుండా వాయించడానికి ఆమెకు అభిమానం! మూడు నెలలకోసారి రేడియోవాళ్ళు పిల్చినపుడు వెళ్ళి ప్రోగ్రామ్ యిచ్చివస్తే అదొక పెద్ద "ఛేంజ్" ఆమెకు! దానికోసం ఎదురు చూస్తుంటుంది. యీ మధ్య నందగోపాల్ ఆమెకో పెద్ద సమస్య అయినాడు. అతడో భావుకుడు. ఏదో ఊహాలోకాల్లో తేలిపోతుంటాడు. అతడు మట్లాడితే వేణు వూదినట్లుంటుంది. అతన్ని చూస్తే, అతని మాట వింటే ఆమె మనసు స్వాధీనం లేకుండా పోతుంది.

నాగరాజులో ఏదైతే ఆమె నాకర్షించిందో అదే నందగోపాల్లో చూచి ఆమె బలహీనురాలవుతోంది. ఒకసారి భర్తతో చెప్పుదామనుకుంది "నందగోపాల్ ను మనింటికి పిలవద్దండీ" అని! కాని అతడు కారణ మడిగితే తా నేమి చెప్పగలదూ? నిర్మలంగా, స్వచ్ఛందంగా నవ్వే నందగోపాల్ మీద ఏమని నేరారోపణ చేస్తుంది? నిస్సహాయంగా ఓ నిద్ర పట్టని రాత్రి ఆ కిటికీ దగ్గరే నిలబడి బైటకు చూసింది. చెరువులో పడ్డ చందమామ లాగా ఆమె హృదయం చలించింది. "చచ్చిపోనా ఆ చెరువులో పడి'' అనుకుంది. ఏదో గుర్తుకురాగా చప్పుడు కాకుండా గాద్రెజ్ అల్మారా తెరిచి, లోపల లాకర్లోవున్న ఓ గంధపు చెక్క పెట్టె - విశాఖలో కొన్న దంతపు పని చేసిన గంధపు పెట్టెలో దాచుకున్న ఉత్తరాలు, ప్రాణప్రదంగా దాచుకున్న ఉత్తరాలు, ఎప్పుడో నాగరాజు ఆమెకు ప్రేమికుడుగా వ్రాసిన ఉత్తరాలు చదువుకుంటూ, పరవశిస్తూ రాత్రి గడిపింది; ఇవాళా అంతే. కానేపు తన సర్వస్వాన్నీ రక్షించిన ఆ ఉత్తరాల్ని మరొకసారి చదువుకుంది. భర్త లేచేప్పటికి వీణ తుడుస్తూ కూర్చుంది నీలవేణి.

* * * *

నాలుగో భాగాంలో ప్రకాశరావు వార్టి కల్చరిస్టు; అతని భార్య ఇందుమతి. లెక్కల్లో ఎం.ఏ. పాసయింది. ఒక ఏడాది గుంటూరు వుమన్స్ కాలేజిలో లెక్చరర్ గా పని చేసింది. వాళ్లిద్దరు మేనత్త మేనమామ బిడ్డలే. చిన్నప్పటినుంచి అనుకున్న సంబంధమే అయినా పెళ్ళికాకముందు ప్రేమించుకోవడం, పత్రాలు వ్రాసుకోడం లాంటివేమీ జరగలేదు. ఆరోజు రెండో శనివారం కావడాన ప్రకాశం ఎనిమిదింటికి లేచాడు. అప్పటికే ఇందుమతి స్నానం చేసి తల దువ్వుకుంటూ వార్తలు వింటోంది. ప్రకాశం లేస్తూనే "ఇందూ! కాఫీ" అన్నాడు. ట్రాన్సిస్టర్ భర్తకు యిచ్చి కాఫీ తేవడానికి వెళ్ళింది. ఇంతలో బజర్ మ్రోగింది. వెళ్ళి తలుపు తీసింది. ఎవరో వచ్చారు, కూర్చోమని చెప్పింది. ప్రకాశం ముఖం కడుక్కోకుండానే లేచి వెళ్ళి వచ్చిన మనిషితో పావుగంట మాట్లాడి పంపించాడు. "ఎవరండీ ఆయన'' అనడిగింది ఇందుమతి. "ఎవరో తెలిసినతను" అన్నాడు ప్రకాశం. ఆమెకు చిరాకేసింది. "అతని పేరు నేను విన గూడదా ఏం?" అంది. ప్రకాశం వింతగా భార్యవంక చూస్తూ "అదేమిటి ఇందూ, నాకు కావలసినవాళ్ళూ, నా స్నేహితులూ అందరూ నీకు తెలుసా? ఇప్పుడు వచ్చినతని కొడుకు బి. యస్సి. పరీక్ష యిచ్చాడట. ఒక పేపరు శేషాద్రికి వచ్చిందట. దాంట్లో కాసిని మార్కులు వెయ్యమని నేను శేషాద్రికి శిఫార్సు చెయ్యాలట! ఇట్లాంటి చెత్తకబుర్లు నీ కేం బాగుంటుం దని చెప్పలేదు" అన్నాడు. "ఆ వచ్చినతడిమీద నాకు ఆసక్తి పెరిగిపోయి నేను అడుగలేదు; కాని మీరు మీ లోకం చుట్టూగోడ కట్టుకుని నన్ను తొంగికూడ చూడనివ్వరు - చూడండి, అదే నాకు కోపం!" అంది. ప్రకాశం నవ్వాడు "పిచ్చి ఇందూ! మీ ఆడవాళ్ళు పెళ్ళయ్యాక మీకు వేరే లోకమే లేకుండా చేసుకుని భర్తమీద ఆధారపడాలని చూస్తే. మగవాడికి అంతకన్నా బోర్ ఇంకోటి వుందా? నువ్వొకసారి అన్నావు గుర్తుందా 'మీ కోసం నా ఫ్రెండ్సునీ, నా హాబీలని అన్నిటినీ వదులుకున్నానని.' ఎవ రడిగారు వదులుకోమని? అవి వదలక పోతేనే మగవాళ్ళకు సుఖం!" అన్నాడు.

"మీ లోకం మీది, మా లోకం మాదిగా బ్రతకడానికి యీ పెళ్ళిళ్ళు ఎందుకు? ఆధునిక యువతి తిండి పెట్టేవాడికోసం, నీడ నిచ్చేవాడికోసం పెండ్లాడదు. ఆ రెంటికీ ఆమె పురుషునిపై ఆధారపడాల్సిన అవసరం లేదు" అందామె. ప్రకాశం పకపకా నవ్వి, "ఇందూ, నీకు కోపం వచ్చినప్పుడుమాత్రం అందంగా కనిపిస్తావ్ సుమా! సరేకాని మరి రక్షణ కోసం పెళ్ళి చేసుకుంటోందంటే ఒప్పుకుంటావా?" అన్నాడు. "ఆహా! రక్షణ, పెద్దరక్షణ! అదే కావలసివస్తే Y. W. C. A. లో దొరుకుతుంది. ఆ మాటకు వస్తే తన్ను తాను రక్షించుకోలేని స్త్రీని




భర్తకూడా రక్షించలేదు" అంది. "మరయితే మీ ఆధునిక యువతి దేనికోసం పెళ్లాడుతోన్నట్టు?" అన్నాడు ప్రకాశం.

"తనకు నచ్చినమనిషి స్నేహంకోసం. సరిగ్గా చెప్పాలంటే అతని కంపెనీకోసం" అంది. ప్రకాశం మరి వాదం పెంచకుండా తువాలు భుజాన వేసుకుని స్నానానికి వెళ్ళాడు. స్నానం చేసివచ్చి, "ఇందూ, వంట చేస్తున్నావా? నేను కూరలు కోసివ్వనా?" అన్నాడు. ఇందుమతి భర్త వంక చూస్తూ "అహాహా! అన్యోన్యం! వెళ్ళండిక్కడనుంచి!" అని కసురుకుంది. వాళ్లు మాట్లాడుకుంటూ భోంచేస్తుండగా పోస్టు వచ్చింది "బాబు, వుత్తరం" అన్నాడు ప్రకాశం. భోజనం ఆపేసి ఉత్తరం చదవడం మొదలెట్టింది ఇందుమతి. వాళ్ళ ఒక్కగానొక్క కొడుకు పదేళ్ళవాడు సైనికస్కూల్లో చదువుకుంటున్నాడు. "వాణ్ణి తీసుకుపోయి అక్కడ పెట్టారు. యీ వూళ్లోనే చదువుకుంటే నాకెంత బాగుంటుంది" అంది. "బాగుంది యింట్లో నీకు బోర్ అని వాడి చదువు చెడగొడ్తావా? అయినా నీకు స్కూల్లో బోలెడుమంది వున్నారుగా పిల్లలు?" అన్నాడు ప్రకాశం నవ్వుతూ. రోజూ భర్త పదింటికి భోంచేసి వెళ్లాక ఇందుమతి అర్ఫన్ స్కూలుకు వెళ్ళి మధ్యాహ్నం 3 గంటలకు వస్తుంది- ఆనరరీ వుద్యోగం. సాయింత్రం క్లబ్‌కు వెళ్లి రాత్రి 8 గంటలకుకాని భర్త రాడు కనుక ఒక గంటసేపు తెలిసినవాళ్ల అమ్మాయిలు, కాలేజి విద్యార్థినులను నల్గుర్ని రమ్మని వాళ్ళకు లెక్కలు, ఫిజిక్సు, కెమిస్ట్రీ చెప్తుంది. దానికి ప్రకాశం ఎప్పుడూ మీ పిల్లలు బాగున్నారా, యీ ఏడాది పాసవుతారా?" అంటూ ఎగతాళి చేస్తుంటాడు.

"ఒకత్తైనా మరి. యింట్లో నాకేం తోస్తుంది?" అంటుంది ఆమె. ప్రకాశం "నువ్వూ క్లబ్ కెళ్ళు" అన్నాడు. "పోదురూ! అక్కడ ఏం మాట్లాడాలన్నా చిరాకే నాకు" అందామె. "ఏం, మీ శ్రీవారినిగురించి డాబులు చెప్పు. మా యింట్లో రిఫ్రిజరేటరు వుందని చెప్పు. కారు అమ్మేసి కొత్తకారు కొనబోతున్నాం అని చెప్పు. పోనీ క్లబ్ కెళ్ళకపోతే ఎప్పుడన్నా పక్కయింటావిడతో పోట్లాడుతోవుండు. రోజూ పనిమనిషిమీద కేకలు వేస్తూండు- తోచడానికి బోలెడు చిట్కాలు" అన్నాడు.

"చాల్చాలు మీ సలహాలు; మీకో నమస్కారం" అంది ఇందు. సాయంత్రం టీ త్రాగాక "ఇందూ! ఏమి టివాళ ప్రోగ్రాం? సినిమా కెళ్దామా?" అన్నాడు. "మంచి దేమీలేదు చూడ్డానికి" అంది ఇందు. "అయితే నేను క్లబ్ కెళ్తాను" అన్నాడు ప్రకాశం. "ప్రోగ్రా మేమీ లేకపోతే యింట్లో వుండకూడదాఏం?" అందామె. "చూడు, ఏం చెయ్యమంటావ్ చెప్పు? ఏమైనా పని వుంటే చెప్పు. నీ పనికంటే నా కేమి ఎక్కువ" అన్నాడు. "పనేమీ లేదు. వెళ్ళిరండి" అందామె. ప్రకాశం క్లబ్‌కు వెళ్ళిపోయాడు. ఇందుమతి పత్రిక తీసుకుంది. ఎప్పుడో టాగూరు వ్రాసిన నవలను తెర కెక్కించి మరోసారి స్వర్ణ పతకాన్ని అందుకున్నాడట - సత్యజిత్ రాయ్. చారులత కథ చదివి నవ్వుకుంది ఇందుమతి. పత్రిక మూసి కిటికీలోంచి బైటకు చూడసాగింది. సాయింత్రం ఎండ చెరువులోపడి అలలమీద మిలమిలా మెరుస్తోంది. చదువుకోడానికి వచ్చే కాలేజి అమ్మాయిలకోసం ఎదురు చూడసాగింది ఇందుమతి.